క్లుప్తంగా

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ


ఏలేశ్వరంలో మొక్కలు నాటుతున్న పర్యావరణ పరిరక్షణ సమితి ప్రతినిధులు

ఏలేశ్వరం: మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు, ప్రముఖ వైద్యుడు ఎస్. విజయబాబు అన్నారు. పట్టణంలోని జయశ్రీ పేలస్ వెనుక కాలనీలో ఆదివారం రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ వాతావరణ పరిరక్షణలో మొక్కలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. మొక్కల పెంపకంతో వాతావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చన్నారు. మొక్కల పెంపకంపై యువత ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గోళ్ల నాగేశ్వరరావు, అనసూరి నాగేశ్వరరావు, ముద్రగడ వీరేంద్ర, గోళ్ల సతీష్‌కుమార్, చల్లా వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ

తుని: హాస్టల్ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ ఆదేశించారు. స్థానిక మహాత్మ జ్యోతీరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, వంటశాల, సరకులను పరిశీలించారు. మెనూ క్రమం తప్పకుండా పాటించాలని నిర్వాహకులను ఆదేశించారు. పాఠశాల పరిసరాలు, టాయిలెట్లను పరిశీలించారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యాన్ని రోజూ పర్యవేక్షించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి ఉన్నతవిద్య, భవిష్యత్ కార్యాచరణపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులపై వారితో చర్చించారు. విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాలని, ఈ నెల 10న నిర్వహించే మెగా పేరెంట్ టీచర్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ప్రిన్సిపల్ యజ్ఞ, ఉపాధ్యాయలను ఆదేశించారు.

ఘనంగా గురుపూజోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

తుని: స్థానిక సరస్వతీ శిశుమందిర్‌లో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం గురుపూజోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చదరం శివాజీ మాట్లాడుతూ ప్రతి భారతీయ పౌరుడు దేశభక్తి కలిగి ఉండాలని, సామాజిక విషయాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ విషయంలో ఆర్ఎస్ఎస్ దేశవ్యాప్తంగా చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. తుని ఖండ్ కుటుంబ ప్రయోదన్ ప్రముఖ్ కుందెం సత్యనారాయణ మాట్లాడుతూ గురుపూజోత్సవం ఆవశ్యకత, వ్యాసభగవానుని విశిష్టతను వివరించారు. ఆర్ఎస్ఎస్ ప్రారంభించి వచ్చే విజయ దశమికి 100 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో అనేక కార్యక్రమాలు తలపెట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో మునగాల ఉదయ్‌కుమార్, పర్వత బాబూరావు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రోగాల బారిన పడకుండా అప్రమత్తం చేయాలి


ప్రత్తిపాడులో యాంటీ రాబిస్ వ్యాక్సిన్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ

ప్రత్తిపాడు: జూనోటిక్ రోగాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచించారు. ప్రత్తిపాడులో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని యాంటీ రాబిస్ వ్యాక్సిన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని పెంపుడు కుక్కలతో పాటు గ్రామాల్లోని వీధి కుక్కలకు సైతం వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. రేబీస్ వ్యాధి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చిక్కం బాలచంద్ర యోగేశ్వర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం ఆరు వేల డోసుల వ్యాక్సిన్ అందుబాటులో ఉంచామని తెలిపారు. శంఖవరం సహాయ సంచాలకుడు డాక్టర్ మనోజ్ కుమార్, సర్పంచ్ అమరాది వెంకట్రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్ముల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాన్ని ప్రజలకు వివరించాలి

- కూటమి పాలనలో ఏ వర్గానికీ మేలు జరగడం లేదు
- దారుణంగా నష్టపోతున్న రైతులు
- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా

గండేపల్లి/జగ్గంపేట: మోసపూరిత హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయ్యిందని, చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేసి ప్రజలు ఏవిధంగా మోసపోయారో వారికి వివరించాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా సూచించారు. గండేపల్లి మండలం సాయిబాలాజీ ఫంక్షన్ హాలులో ఆదివారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అధ్యక్షతన పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాడిశెట్టి రాజా మాట్లాడుతూ కూటమి పాలనలో రాష్ట్రంలో ఏ వర్గానికీ మేలు జరగడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో గిట్టుబాటు ధరలు లేక మామిడి, ఆక్వా, పొగాకు, మిర్చి రైతులు తీవ్రం నష్టపోతున్నారని తెలిపారు. ఖరీఫ్‌లో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి ఇప్పటివరకూ రైతులకు డబ్బులు ఇవ్వలేదని ఆరోపించారు. పక్క రాష్ట్రం కర్ణాటకలో ప్రభుత్వం మామిడికి కేజీకి రూ.14 గిట్టుబాటు ధర ఇస్తుంటే, మన రాష్ట్రంలో చంద్రబాబు మాత్రం మామిడి రైతులను ఆదుకోలేదన్నారు. ఒక వర్గం ప్రజలకు మేలు చేసేందుకు మాత్రమే బాబు కృషి చేస్తున్నారని విమర్శించారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, చిత్రంలో మాజీ మంత్రి తోట నరసింహం

కూటమి పాలనలో మహిళలపై దాడులు

మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులను ప్రశ్నించని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళలు, బాలికలపై అకృత్యాలు జరిగిపోతున్నాయని నానా హంగామా చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వంలో మైనర్ బాలికలు, మహిళలపై జరుగుతున్న దారుణాలను ఎందుకు ప్రశ్నించటం లేదని విమర్శించారు. జగ్గంపేట నియోజకవర్గంలోని కూటమి నేతలను స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖంగు తినిపించాలని సూచించారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

మాజీ మంత్రి తోట నరసింహం మాట్లాడుతూ బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ ఏ విధంగా అమలవుతుందో ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలతో ప్రతి కుటుంబానికి ఐదేళ్లలో రూ.5.20 లక్షలు రావాల్సి ఉందన్నారు. దీని ప్రకారం ఈ ఏడాది రూ.లక్షకు పైగా ప్రతి కుటుంబానికి రావాలని, వచ్చాయో ? లేదో ? ప్రజలు పరిశీలించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తూ.చా. తప్పకుండా అమలు చేస్తే ప్రజలు జేబులు ఖాళీగా ఉండవన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రోడ్డెక్కితే వార్ వన్‌సైడే అని, వచ్చేది జగన్ పాలనే అన్నారు.

హామీలు అమలు చేయడం లేదు

కాకినాడ పార్లమెంటరీ పరిశీలకుడు సూర్యనారాయణరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పింఛన్ల కోత, తల్లికి వందనంలో కోత, ఇలా ప్రతి పథకాన్ని సక్రమంగా అమలు చేయటం లేదన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా నీటితీరువా వసూలు చేస్తున్నారని విమర్శించారు. పలువురు నేతలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. కార్యక్రమంలో పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త ముద్రగడ గిరిబాబు, రాష్ట్ర ఐటీ విభాగం జాయింట్ సెక్రటరీ తాళ్లూరి మధుకుమార్, రాష్ట్ర నేత తోట అయ్యన్న, గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు, పార్టీ జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు ఒమ్మి రఘురాం, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు రామకుర్తి రామచంద్రమూర్తి, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, జగ్గంపేట మండల అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, గండేపల్లి మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, గోకవరం మండల అధ్యక్షుడు పాటి రాంబాబు, కిర్లంపూడి మండల అధ్యక్షుడు పెనుగంటి రాజేష్, నియోజకవర్గ లీగల్ సెల్ విభాగం అధ్యక్షుడు గుల్లా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

రేపు వైఎస్సార్ జయంతి వేడుకలు


ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ ఈ నెల 8న నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా అదే రోజు ప్రత్తిపాడు లయన్స్ క్లబ్‌లో నిర్వహించే రక్తదాన శిబిరాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయలని కోరారు.

అరుణాచల క్షేత్రంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు


రాచపల్లి అరుణాచలక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లిలోని అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివ భక్తులైన 63 మంది నాయనార్లతో పాటు దక్షిణా మూర్తి, లక్ష్మీ హయగ్రీవుడు, సూర్యభగవానుడు, కాలభైరవుడు, గంగామాత విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని మూడో రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను శ్రీరమణాసేవాశ్రమం వ్యవస్థాపకులు స్వామి రామానంద, ఆధ్యాత్మిక వేత్త అరుణాచల మాధవి పర్యవేక్షించారు.

సత్యదేవుని దర్శించిన దేవదాయ శాఖ కమిషనర్


దేవదాయ శాఖ కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న ఈఓ, తదితరుల


బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణకు సత్యదేవుని ప్రసాదం, ఫొటో అందజేస్తున్న ఈఓ

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయాన్ని దేవదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదివారం ఉదయం దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలు, చిత్రపటాన్ని ఈఓ వీర్ల సుబ్బారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన దేవస్థానం అభివృద్ధిపై ఈఓ, అధికారులతో చర్చించారు.

సత్యదేవుని దర్శించిన ప్రభుత్వ ఎక్స్–అఫీషియో కార్యదర్శి సత్యనారాయణ

రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి ఎస్.సత్యనారాయణ ఆదివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆయనకు స్వామివారి ఫొటో, ప్రసాదాలను ఈఓ అందజేశారు. నర్సాపురం మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు కుటుంబ సభ్యులతో కలిసి రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు.

పునరావాస కాలనీలో వసతులు కల్పిస్తాం


కుమ్మరిలోవ పునరావాస కాలనీలో నిర్వాసితులతో చర్చిస్తున్న జేసీ రాహుల్ మీనా

- జేసీ రాహుల్ మీనా

తుని: పోలవరం ఎడమ కాలువ నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు పునరావాస కాలనీలో సదుపాయాలను కల్పిస్తామని జేసీ రాహుల్ మీనా అన్నారు. ఆదివారం తుని మండలం కుమ్మరిలోవ నిర్వాసితులతో కలిసి దుద్దుకొండ ప్రాంతంలో పునరావాస కాలనీలో పర్యటించారు. తాగునీరు, విద్యుత్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు ఇళ్లు ఖాళీ చేయాలని ఒత్తిడి తీసుకువస్తున్నారని నిర్వాసితులు జేసీ దృష్టికి తీసుకువచ్చారు. పట్టాలు పొందిన అందరూ నివాసాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ ప్రసాద్, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తోట నరసింహం పుట్టినరోజు వేడుకలు

గండేపల్లి/జగ్గంపేట: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా తోట నరసింహంతో కేక్ కట్ చేయించి తినిపించారు. పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని తోట నరసింహానికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వీరవరంలోని ఆయన నివాసంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి గజమాలలు, శాలువాలతో తోట నరసింహాన్ని ఘనంగా సత్కరించారు. తోట నరసింహం పార్టీ శ్రేణులు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసి స్వీట్స్ పంచారు. సీనియర్ నేత తోట బాబ్జీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



తోట నరసింహానికి కేక్ తినిపిస్తున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా . (అంతర చిత్రం) గజమాలతో సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా

కోటనందూరు: అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిన మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్ రామ్ అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా కొనియాడారు. మండలంలోని బొద్దవరంలో ఆదియాంధ్ర యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. దాడిశెట్టి రాజా ముఖ్య అతిథిగా పాల్గొని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాడిశెట్టి రాజా మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ సూచించిన మార్గంలో నేటి యువత నడవాలని, సమాజ శ్రేయస్సుకు తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి లాలం బాబ్జీ, సీపీ వాణిజ్య విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ వెలగా వెంకట కృష్ణాజీ, మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఉల్లూరి శ్రీను, వేగి అప్పలనాయుడు, యల్లపు సత్యనారాయణ, దొడ్డి బాబ్జీ, అయినవిల్లి సింహాచలం, అడ్డాల అప్పలరాజు, ఏడిద రవికుమార్, అయినవిల్లి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.


బొద్దవరంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దాడిశెట్టి రాజా

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

ఏలేశ్వరం: పట్టణంలో ఆదివారం బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ చిన్నతనం నుంచి కులవివక్షపై పోరాటం చేశారన్నారు. దళితుల్లో మొదటిసారిగా ఉప ప్రధాని చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పైల విజయ్‌కుమార్, కావలి శ్రీనివాసరావు, చందక కిరణ్‌బాబు, దత్తి రామకృష్ణ, సాదే నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


ఏలేశ్వరంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి వేడుకలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

ఏలేశ్వరం: నియోజకవర్గంలో తొలి ఏకాదశి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. త్రిమూర్తుల్లో స్థితికారకుడైన శ్రీమహావిష్ణువు ఏడాదిలో ఎనిమిది నెలల పాటు లోకసంరక్షణ కార్యాన్ని సాగించి నాలుగు నెలలు పాటు యోగనిద్రకు ఉపక్రమిస్తారు. ఆ రోజునే శయన ఏకాదశి, తొలి ఏకాదశి వేడుకలు నిర్వహిస్తారు. ఏలేశ్వరం పట్టణం, పలు గ్రామాల్లోని రామాలయాల వద్ద వివిధ భజన బృందాలతో ఏకాహం నిర్వహించారు. స్థానిక సత్యనారాయణస్వామి ఆలయంలో మహిళలు పలు పారాయణలు పఠించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


కాత్రావులపల్లిలో రథంపై స్వామివారి ఊరేగింపు


ఏలేశ్వరంలో పారాయణం చేస్తున్న మహిళలు

గోకవరం: మండలంలో తొలి ఏకాదశి వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తంటికొండ గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. గుమ్మళ్లదొడ్డిలోని రామగిరి కొండపై, వల్మీక వేంకటేశ్వరస్వామి, తిరుమలాయపాలెంలో లక్ష్మీ సమేత వరాహ స్వామి, గోకవరంలోని రమాసత్యన్నారాయణ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. గోకవరం గీతామందిరంలో శ్రీసూర్యపీఠం ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కిర్లంపూడి: తొలి ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చిల్లంగిలో వేంచేసిన అష్టలక్ష్మి సమేత లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో అర్చకుడు సాయిశర్మ ఆధ్వర్యంలో లక్ష్మీసహస్రనామం, విష్ణు సహస్రనామ పారాయణలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.


ధర్మవరంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలవ్యాప్తంగా తొలి ఏకాదశి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. తెల్లవారు జాము నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మండలంలోని ఉత్తరకంచి పద్మావతి అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం, ధర్మవరంలో రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు స్వామి, అమ్మ వార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ధర్మవరంలో జువ్వలవారివీధి రామాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ఏకాహం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు సీతారాములను దర్శించుకని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జువ్వల బాబులు, కోలా తాతబాబు, జువ్వల సత్యనారాయణ, కుప్పిన శీను, జువ్వల దొరబాబు, బొల్లు నాగేశ్వరరావు, పెద్దిరెడ్డి కాసులు తదితరులు పాల్గొన్నారు.


ఉత్తరకంచిలో విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

జగ్గంపేట: తొలి ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని కాత్రావులపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు స్వామివారిని రథంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కత్తిపూడిలో చోరీ


కత్తిపూడిలో చోరీ చేసిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై హరిబాబు

శంఖవరం: మండలంలోని కత్తిపూడి కృష్ణాలయం సమీపంలోని ఓ ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగినట్లు అన్నవరం ఎస్సై జి.హరిబాబు తెలిపారు. వివరాల్లోకి వెళితే... ఇంటి యజమాని రౌతు శివ నాయనమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో ఆయన తన అన్నయ్య ఇంట్లో ఉన్నారు. దీంతో ఇంట్లో ఎవ్వరూ లేరని గమనించిన దుండగులు తాళాలు బద్దలుగొట్టి చోరీ చేశారు. 50 తులాలు వెండి, రూ.10 వేలు నగదు, టీవీ చోరీ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.